www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 7 మే 2025

5

తూర్పుగోదావరి



ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

ప్రజాశక్తి - సీతానగరం

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఎపిడి రామ్‌ప్రసాద్ ఉపాధి సిబ్బందికి సూచించారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు అంశాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. నిర్దేశించిన పనిదినాల లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కూలీలకు సగటున రూ.300 వేతనం అందేలా పనులు ఇవ్వాలన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకాలను అమలు చేయాలన్నారు. ఉపాధి చట్టం అమల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సత్యవతి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి రైతు కుదేలు...

- వర్షాలకు తెగుళ్ల దాడి..
- సిండికేట్‌తో ధర పతనం
- ఆపదలో ఆదుకోని పంటల బీమా

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో మామిడి రైతులు కుదేలవుతున్నారు ఏటా నష్టపోతున్న తమకు ఈ ఏడాదైనా లాభాలు తెచ్చి పెడుతుందన్న రైతుల ఆశ అననుకూల వాతావరణంతో అడియాశలుగానే మారాయి. ఈదురు గాలులకు పిందెలు, కాయలు రాలిపోతుండగా వర్షాల కారణంగా మంగు తెగులు సోకడంతో ఈ ఏడాదీ తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. మార్చి, ఏప్రిల్‌లో ఆకాశాన్ని అంటాల్సిన ధరలు పాతాళానికి పడిపోయాయి. జిల్లాలో 14,753 ఎకరాల్లో మామిడి సాగు జరుగుతుంది. ప్రస్తుత సీజన్‌లో ముందస్తు పూతలు కనిపించడంతో నవంబర్ నుంచి మామిడి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. తొలి విడతగా వచ్చిన మామిడిపూతలు జనవరిలో పిందెగా మారడంతో ఈ సీజన్ ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆనంద



పడ్డారు. అయితే ఈదురు గాలులు, వర్షాలకు పిందెరాలిపోయింది. కొద్ది రోజులకు మరల తిరిగి పూత రావడంతో పంట నాణ్యత కాపాడేందుకు ఇప్పటికే 10 నుంచి 14 సార్లు పురుగు మందులు పిచికారీ చేశారు. అయినా వర్షాల రూపంలో దురదృష్టం వెంటాడడంతో మామిడికాయల నాణ్యత నిలవలేదు. వర్షాల కారణంగా మంగు తెగులు సోకడంతో కాయల నాణ్యత పడిపోయి, తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

వ్యాపారుల సిండికేట్‌తో ధరలు పతనం

మామిడి సీజన్ ప్రారంభంలో బంగినపల్లి టన్నుధర దాదాపు రూ.60వేల నుంచి రూ.70 వేల మధ్య పలికింది. తోతాపురి (కలెక్టర్) రకం మామిడి రూ.30 వేల నుంచి రూ.40వేల మధ్య పలికింది. మార్చి మధ్యంతరం వరకు ఇవే ధరలు కొనసాగగా, వర్షాల అనంతరం ధరలు భారీగా పతనమయ్యాయి. రాజమహేంద్రవరంలో మామిడి మార్కెట్లో విక్రయించడంతో పాటు కోల్‌కతా, ఒడిశా, మహారాష్ట్ర నుంచి వ్యాపారులు వచ్చి తోటలను నేరుగా కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం కోల్‌కతా నుంచి కొందరు వ్యాపారులు వచ్చి వారు చెప్పిందే వేదంగా వ్యవహారం నడుస్తోంది. కనిష్ఠంగా రూ.5వేలకు పడి పోయిందంటే వారి ప్రభావం ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మంగుతెగులు సాకు చూపి స్థానికంగా ఉండే కమీషన్ వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో టన్ను తోతాపురి కాయల ధర రూ.25 వేల నుంచి రూ.30 వేలకే పరిమితం అయ్యింది. టన్ను చిన్న రసాల ధర రూ.30నుంచి రూ.40 వేలు, బంగినపల్లి ధర టన్ను రూ.35 వేల నుంచి రూ.45 వేల వరకు ఉంది. నాణ్యత కలిగిన కాయలు 20 శాతానికి మించి లేకపోవడంతో రైతులు కనిష్ఠ ధరలకు మాత్రమే పరిమితమవుతున్నారు.

వేధిస్తున్న అకాల వర్షాలు, తెగుళ్లు

మార్చి ప్రారంభంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ 37 డిగ్రీల పైబడి నమోదయ్యాయి. అయితే మార్చి చివరి వారం నుంచిలో వర్షాలు కురవడంతో వాతావరణంలో తీవ్ర మార్పులు చోటుచేసుకున్నాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా నమోదు కావడం, ఉదయం పూట పొగమంచు కారణంగా మామిడిపై మంగు తెగులు విజృంభించింది. ఉద్యానవన శాఖ అధికారులు వాతావరణ ఆధారిత పంటల బీమాపై కనీసం దష్టి పెట్టలేదు. ఫలితంగా రైతులు మార్కెట్లో ధర లేక మరో వైపు బీమా అమలు కాక నష్టపోతున్నామని మామిడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది నష్టాలే...

ఈ ఏడాది మామిడి సాగు నష్టాలే. వర్షాలకు తోటల్లో కాయలు పూర్తిగా పాడైపోయాయి. వాతావరణం అసలు అనుకూలించలేదు. మందులు వాడినా పుచ్చులు ఎక్కువగా వచ్చాయి. ధరలు లేకపోవటం, దిగుబడులు లేకపోవటంతో పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేలా లేవు. ప్రభుత్వం ఆదుకోవాలి. పరిహారం అందజేయాలి.

- ఎన్.చక్రవర్తి, మామిడి రైతు, శ్రీకృష్ణపట్నం, రాజానగరం మండలం



సదస్సులో మాట్లాడుతున్న అరుణ్

లేబర్ కోడ్‌లతో కార్మికుల భద్రతకు ముప్పు

- 20న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలి
- కార్మిక ఉద్యోగ సదస్సులో వక్తలు పిలుపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లు అమలైతే కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతుందని పలువురు వక్తలు అన్నారు. దేశవ్యాప్తంగా మోడీ సర్కారు అనుసరిస్తోన్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోరుతూ ఈ నెల 20న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అఖిల భారత సమ్మె జరుగనుంది. ఈ నేపథ్యంలో సమ్మె జయప్రదం కోసం రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాల్లో మంగళవారం సన్నాహక సదస్సు జరిగింది. అఖిలపక్ష కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు టి.మధు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వరావు, ఎఐఎఫ్‌టియు జిల్లా నాయకులు జోజి, ఐఎఫ్‌టియు నాయకులు ఎస్.కిరణ్ మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాసేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఈ క్రమంలోనే 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చివేసిందన్నారు. లేబర్ కోడ్లు అమలైతే కార్మికులు సమ్మె చేసే హక్కును, సంఘం పెట్టుకునే హక్కును, యాజమాన్యంతో జీతభత్యాలు బేరం ఆడుకోనే హక్కును కోల్పోతారన్నారు. యజమానికి నచ్చితే ఉద్యోగం, నచ్చకపోతే తొలగించే విధంగా చట్టాల్లో మార్పు తీసుకొచ్చారని తెలిపారు. కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, సామాజిక భద్రత, పెన్షన్ సౌకర్యం వంటివన్నీ కోల్పోతారన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే ఈ లేబర్ కోడ్లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు పోరాడుతున్నాయని తెలిపారు. మే 20న జరిగే సమ్మెను బలపరుస్తూ గ్రామీణ ప్రాంతంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు హర్తాళ్‌కు పిలుపునిచ్చాయన్నారు. సమ్మెను జయప్రదం చేయడం ద్వారా మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కోరారు. బ్యాంకింగ్ రంగం నాయకులు లక్ష్మీపతి, ఎఆర్‌బిఎ నాయకులు సిహెచ్.వెంకటేష్ మాట్లాడుతూ బ్యాంకుల విలీనం పేరుతో ఉద్యోగుల సంఖ్యను కుదిస్తున్నారన్నారు. నూతన నియామకాల కోసం తాము కూడా సమ్మెలో భాగస్వామ్యం అవుతున్నామని తెలిపారు. ప్రభుత్వ రంగం ప్రయివేటీకరణను అడ్డుకోవాలని, ప్రజలపై ఛార్జీల భారాలు తొలగించాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్‌బాబు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. సదస్సుకు అధ్యక్షవర్గంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు జె.టి.రామారావు, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు సప్పా రమణ, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు కొరడి. అప్పారావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ సంఘం నాయకులు ప్రవీణ్, పిసిసి జిల్లా అధ్యక్షులు టికె.విశ్వేశ్వరరెడ్డి హాజరై సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సదస్సులో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు ఎస్ఎస్.మూర్తి, పూర్ణిమరాజు, బేబిరాణి, కృష్ణ, వెంకటలక్ష్మి, నల్లా రామారావు, కొండల రావు తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపూడిలో 144 సెక్షన్

ప్రజాశక్తి - కోరుకొండ

మండలంలోని బూరుగుపూడిలో సోమవారం రాత్రి జరిగిన ఆందోళన నేపథ్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఉత్తర మండల డిఎస్‌పి వై.శ్రీకాంత్ తెలిపారు. నార్త్ జోన్ కార్యాలయంలో మంగళవారం ఉదయం డిఎస్‌పి విలేకర్లతో మాట్లాడారు. సోమవారం రాత్రి బూరుగుపూడిలో రెండు గ్రూపుల మధ్య ఘర్షణ జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు కోరుకొండ పోలీసులు సకాలంలో అక్కడకు చేరుకుని రెండు గ్రూపులను చెదరగొట్టారన్నారు. ఒక గ్రూపునకు చెందిన పుట్టిన రోజు వేడుకల్లో కొంత మంది మద్యం సేవించి రోడ్డుపైకి చేరుకుని ట్రాక్టర్‌ను ఆపడంతో వివాదం చెలరేగిందన్నారు. బూరుగుపూడికి చెందిన చోడదాసి పాల్ ప్రాన్సిస్(టింకు)ని అరెస్ట్ చేసి, మరో ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని తెలిపారు. అదేవిధంగా నరసాపురం గ్రామంలోని ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుండంగా రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో విగ్రహాన్ని రెవెన్యూ అధికారుల కస్టడీలో ఉంచి గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



బూరుగుపూడిలో మోహరించిన పోలీసులు

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

నిడదవోలులో ఈ నెల 9న జరిగే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ వివివిఎస్.రామారావు నిరుద్యోగులకు సూచించారు. 45 పేరెన్నికగన్న కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటున్నాయని తెలిపారు. 1300లకు పైగా ఉద్యోగాలను ఈ మేళాలో కల్పించనున్నారని తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ వరకూ చదివిన విద్యార్థులు జాబ్ మేళాకు హాజరవ్వాలన్నారు. నిడదవోలు మహిళా డిగ్రీ కళాశాలలో 9వ తేదీ ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆశాలకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వేలివెన్ను పిహెచ్‌సిలో మంగళవారం వైద్యాధికారులు డాక్టర్ సృజన, డాక్టర్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో ఆశాలకు పలు అంశాలపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఆశా డేలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామాల్లో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదకర స్థితిలో ఉన్న గర్భిణులను గుర్తించి సకాలంలో వైద్యం అందించడంలో వారి పాత్రను వివరించారు. ఈ - ఆశా యాప్‌లో మార్పుపై అవగాహన కల్పించారు. మహిళా ఆరోగ్య కార్యకర్తలు వారి ప్రాంతాల్లో బుధ, శనివారాల్లో గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. ఎండల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పర్యవేక్షకురాలు కెకె.సుభాషిణి, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజనూ కొంటాం...

- తేమ శాతంపై ఆందోళన చెందొద్దు
- విలేకర్ల సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - నిడదవోలు

వర్షంతో ధాన్యంలో తేమ శాతం పెరిగిందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరి నుంచి ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. మంగళవారం నిడదవోలులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల నసమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణంగా తేమ శాతం 17కు మించితే ధాన్యం కొనుగోలు చేయరన్నారు. కాని కూటమి ప్రభుత్వం తేమ శాతాన్ని పట్టించుకోకుండా ఆరుగాలం శ్రమించిన రైతన్న నుంచి ధాన్యం కొనుగోలు చేసి, వారి బ్యాంకు ఖాతాలకు నగదును జమేసేలా చర్యలు తీసుకుంటుందన్నారు. తేమ శాతం పెరిగితే ధాన్యం కొనుగోలు చేయరనే అపోహలు నమ్మొద్దన్నారు. రైస్ మిల్లర్లు రైతుల నుంచి ఏ రకమైన ధాన్యాన్ని అయినా సేకరించి తీరాలని ఆదేశించారు. దీనిపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. నగదు జమ విషయంలో సాంకేతిక పరమైన ఇబ్బందులు తలెత్తినప్పుడు కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అది ఎంతమాత్రం సరైన విధానం కాదన్నారు. తమది రైతు పక్షపాది ప్రభుత్వమని త్వరలోనే రైతుల ఖాతాల్లో రూ.20,000 నగదు జమ చేసే పథకాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు.

పంట విస్తీర్ణం పెరగడం, దిగుబడి ఎక్కువవడం, రైతు ప్రభుత్వం ఇస్తున్న డబ్బుతో సంతృప్తి వ్యక్తం చేయడం తదితర కారణాల వల్ల ఎక్కువ ధాన్యాన్ని సేకరించే పరిస్థితి ఉత్పన్నమైందన్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకొని ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచామన్నారు. తూర్పుగోదావరి జిల్లా మొత్తంగా పరిశీలిస్తే నిడదవోలు మండలంలోనే 43,229 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ఇది రాష్ట్రంలోనే అత్యధికం అన్నారు. ఉండ్రాజవరం మండలంలో 23,223 మెట్రిక్ టన్నులు, పెరవలిలో 21,234 మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు. వ్యవసాయ, పౌర సరఫరాలు, రెవెన్యూ తదితర శాఖలతో ఎప్పటికప్పుడు ఈ అంశాలపై వివరాలు సేకరిస్తున్నామన్నారు. తాను వియత్నాం పర్యటనలో ఉన్నప్పటికీ సబ్ కలెక్టర్, జెసి, ఎడి, తహశీల్దార్లతో మాట్లాడి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్‌డిఒ రాణిసుస్మిత, ఎఎస్ఒ ఎం.నాగాంజనేయులు, వ్యవసాయ శాఖ ఎడి పి.చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ ఎఒ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్



ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. 2018, 2019, 2020 సంవత్సరాలకు సంబంధించి 14 గ్రూప్‌లకు చెందిన 480 విద్యార్థులకు పట్టాలను అందించారు. ఈ కార్యక్రమానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రసన్నశ్రీ, బిఎంటియు విశ్వవిద్యాలయం, గుజరాత్ ఉపకులపతి ఆచార్య మధుకర్‌భాయ్.ఎస్.పృథ్వీ, ప్రత్యేక అతిధులుగా కళాశాల సిపిడిసి సెక్రటరీ తుమ్మిడి రామకుమార్, కళాశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు ముళ్ల మాధవ్ హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర కళాశాల గత నాలుగేళ్లలో సాధించిన ప్రగతిని వివరించారు. ఆర్ట్స్ కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ పి.బాబ్జి ఎగ్జామినేషన్‌కు సంబంధించిన నివేదికను అందించారు. నన్నయ్య విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికతో కూడిన విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. బిఎంటియు విశ్వవిద్యాలయం, గుజరాత్ ఉపకులపతి ఆచార్య మధుకర్ భాయ్.ఎస్.పృథ్వీ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసినందుకు ఆనందంగా ఉందన్నారు. చదవుతోపాటూ సేవా దక్పథంతో సమాజం పట్ల బాధ్యతతో, దేశభక్తితో విద్యార్థులు ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

మునికూడలి దళితవాడలో తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలం మునికూడలిలోని దళిత పేట ప్రజలు ఏడాదిగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ ఇంటికి మంచి నీటి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని వేడుకుంటూ పంచాయతీ కార్యదర్శి చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో తమ ప్రాంతంలో ఉన్న పంచాయతీ కొళాయిని అధికారులు మూసివేశారన్నారు. దీంతో అనేక కుటుంబాలు తాగు నీటి కొరతను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. కనీసం ఒక్క ఇంటికైనా మంచి నీటి సరఫరా కోసం కుళాయి కనెక్షన్ ఇవ్వాలని గ్రామ పంచాయతీకి మొరపెట్టుకున్నా, కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదని బాధితులు వాపోతున్నారు. తాజాగా, మంగళవారం పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తమ ఇంటికి వచ్చి, కలెక్టర్ కార్యాలయంలో పెట్టిన పిర్యాదును రద్దు చేసుకోవాలని ఒత్తిడి తెచ్చారని వారు చెబుతున్నారు. రద్దు చేసుకున్నట్లు సంతకం పెట్టాలంటూ బలవంతం చేస్తున్నారని తెలిపారు. ఇంటి పన్నులతో పాటు నీటి పన్ను, గ్రంథాలయ పన్ను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నప్పటికీ తమకు కనీసం తాగునీరు కూడా అందించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో నీటి కొరత లేకుండా చూడాలని అడిగితే, ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వడానికి రెండు మూడు నెలలు పడుతుందని అధికారులు సమాధానం చెబుతున్నారని వారు వాపోయారు.

"ఇలా మంచి నీరు లేకుండా మేము చచ్చిపోవాలా?" అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. తమకు వెంటనే కుళాయి కనెక్షన్ ఇవ్వకపోతే మండలాభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద నిరవధిక దీక్ష చేపడతామని వారు హెచ్చరించారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించిముని కూడలి దళిత పేట ప్రజల తాగునీటి కష్టాలను తీర్చాలని వారు కోరుతున్నారు.

తాగునీటి ఇబ్బందులు వాస్తవమే...

తాగునీటి ఇబ్బందులు వాస్తవమే. బాధితులను ఎటువంటి బెదిరింపులకు దిగలేదు. కంప్లైంట్ ఆమోదయోగ్యమా కాదా?అనేది మాత్రమే అడిగాము. దానికి వారు నిరాకరించారు. ప్రస్తుతం కాలనీకి నీరందించాలంటే నెల రోజుల వరకూ సమయం పడుతుంది. అప్పటి వరకూ అర కిలోమీటరు దూరంలో ఉన్న కొళాయి నుంచి తాగునీటిని తెచ్చుకోవాలని సూచించాము.

- మునిదీప్తి, పంచాయతీ క్యాదర్శి, మునికూడలి

సాయం చేయాలనే ఆలోచన గొప్పది

ప్రజాశక్తి - కొవ్వూరు


జీవనోపాధి కోసం చిరు వ్యాపారం చేసుకుంటూ తోటి వారికి సహాయపడాలి అనే ఆలోచన ఎంతో గొప్పదని కొవ్వూరు మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని అన్నారు. వాసవి క్లబ్ రీజనల్ చైర్మన్ పర్యటనలో భాగంగా కొవ్వూరు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వూరులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అచ్చయమ్మ కాలనీలో కంకటాల వెంకటరాజు సహకారంతో వృద్ధులకు పౌష్టిక ఆహారాన్ని పంపిణీ చేశారు. మజ్జిగ పంపిణీ, పాద రక్షల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సురపనేని చిన్ని మాట్లాడుతూ వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి అచ్యుతలక్ష్మి, వి.ప్రసాద్, కె.అనిల్ సూర్య, మన్యం వీరభద్ర గుప్తా, కార్యదర్శి సత్యవరపు గురునాథ్, ఎస్.భరత్ తదితరులు పాల్గొన్నారు

మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు నియోజకవర్గంలో నిరుద్యోగులైన యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మే 9న స్థానిక ఎస్‌విడి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేయనున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెఇపారు. మంగళవారం నిడదవోలులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. వికాస సంస్థ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు మంత్రి తెలిపారు. 1,302 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు అవకాశం ఉందన్నారు. తద్వారా రూ.12వేల నుంచి రూ.40వేల వరకూ వేతనం పొందొచ్చన్నారు. ఇసూజూ, ఎల్ అండ్ టి కన్‌స్ట్రక్షన్, జిఎంఆర్ కార్గో, పానాసోనిక్, హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్, అపోలో ఫార్మసీ, ఐసోన్ ఎక్స్‌పీరియన్సెస్, స్మార్ట్ బ్రెయిన్స్, సాండ్ స్పేస్ టెక్నాలజీస్, డీలేట్ కర్ కార్పొరేట్, సదర్ ల్యాండ్, సినర్జిన్, ఇఎస్ఎఎఫ్, స్పందన, ముత్తూట్ ఫైనాన్స్, పైసా బజార్, రీసొల్యూట్, ఇండస్, ఎంసివి, ఇండో ఎంఐఎం, పిల్కింగ్టన్, ఇన్ ఫిలూమ్, హెచ్‌డిఎఫ్‌సి, బిఎస్ సిపిఎల్, జిఎల్ఆర్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ తదితర 45 కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ, బిటెక్, పీజీ పాసైన వారు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మే 9వ తేదీన ఉదయం 9 గంటలకు తగిన సర్టిఫికెట్లతో జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ పురందేశ్వరి, కలెక్టర్ పి.ప్రశాంతి, మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

కార్టూ'నిజం'



కులగణనతో ఎవరికి లాభం?

ధాన్యం కొనుగోళ్లపై పర్యవేక్షణ తప్పనిసరి

ప్రత్యేకాధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రబీ ధాన్యం సేకరణపై సమన్వయ శాఖల అధికారులతో జెసి ఎస్.చిన్నరాముడుతో కలిసి ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల పరిధిలో ఏఏ రకాల ధాన్యం సాగు చేశారు? వాటిలో ఏ రకం పిడిఎస్ కోసం సేకరించాలి అనేదానిపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కోతలు పూర్తి చేసిన తర్వాత ఎన్ని రోజులకు మిల్లింగ్ చేయడానికి అవకాశం ఉంటుందని ప్రశ్నించారు.. సూపర్, కామన్, ప్రీమియం, వెరైటీ రకాల్లో వేటికి ఓపెన్ మార్కెట్‌లో డిమాండ్ ఉందో గమనించాలన్నారు.

ధాన్యం సేకరణ విషయంలో ఈ క్రాప్ బుకింగ్ ఆధారంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారో లేదో క్షుణ్ణంగా పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. షెడ్యూలింగ్‌ను అనుసరించి కోతలు, ఆర్ఎస్‌కెకు తరలింపు, అక్కడ నుంచి మిల్లు వరకు ధాన్యాన్ని తరలించడంలో సమయ పాలన పాటించాలన్నారు. రికార్డులు నిర్వహణలో శ్రద్ధ ఉండాలన్నారు. అప్పుడే అవకతవకలకు తావుండదన్నారు. ప్రతికూల వార్తలు వచ్చాయి కనుక క్షేత్ర స్థాయి తనిఖీలు చేస్తామనే విధానం సరికాదన్నారు. తనిఖీలు నిరంతరం సాగాలన్నారు. సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్, ధాన్యం సేకరణ సీజన్లో ప్రతి రోజూ క్షేత్ర స్థాయిలో ఆర్ఎస్‌కెల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా సహకార అధికారి, నియోజక వర్గ ప్రత్యేక అధికారులను ఒకొక్క నియోజకవర్గంకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని జెసికి సూచించారు. ధాన్యం సేకరణ క్రమబద్ధీకరణ కోసం నిర్దిష్ట కార్యాచరణ ఉండాలన్నారు. జిల్లా సహకార అధికారుల ద్వారా రికార్డుల నిర్వహణ, షెడ్యూల్, కేటాయింపు, కార్యాచరణ , అందుకు సంబంధించి ఏర్పాట్లు, ఈ క్రాప్ బుకింగ్, రవాణా, గన్ని బ్యాగులు, మిల్లర్, తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఆ మేరకు నివేదిక అందించాలని ఆదేశించారు. రైతులకు మేలు చేసే క్రమంలో అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ సమావేశంలో జెసి ఎస్.చిన్నరాముడు, ఇన్‌ఛార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి ఎం.ప్రేమ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా సహకార అధికారి ఎం.జనార్ధనరెడ్డి, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, డిపిఆర్ఒ వై.బాలకృష్ణ, జిల్లా మేనేజర్, లీగల్ మెట్రలాజీ, టిసిఎస్, డిఎస్ఒ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

నేరాలు ఘోరాలు

గోదావరిలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం


దాసరి సాయిరామ్(ఫైల్)


మెండెం రాంబాబు(ఫైల్)

మండలంలోని కేదార్లంక శివారు వీధి వారి లంకలో మంగళవారం గోదావరి నదిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండపేటకు చెందిన దాసరి సాయిరాం(28), మెండెం రాంబాబు(30) వీధి వారి లంకలో దసమ్మతల్లిని దర్శించుకునేందుకు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వచ్చారు. అనంతరం వీధి వారి లంక వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగారు. ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. మండపేట రూరల్ సిఐ పెద్దిరాజు, అంగర ఎస్ఐ రవికుమార్, సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సాయిరాం, రాంబాబు మృతదేహాలను వెలికి తీశారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు. వీరిలో సాయిరాంకు వివాహం అయ్యింది.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడి గ్రామ శివారున పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో ఎస్.పైడిపాల గ్రామానికి చెందిన చింత శ్రీను 60 లీటర్ల నాటు సారాను తరలిస్తూ పట్టు పడ్డాడు. అతని నుంచి సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి తుని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

అత్యాచార యత్నం కేసులో వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి-గోపాలపురం

అత్యాచార యత్నం కేసులో వ్యక్తికి రిమాండ్ విధించారని ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు వెంకటేష్ ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం 12.30 గం.ల సమయంలో అదే గ్రామంలో ఉన్న ఒక వివాహితపై అత్యాచారయత్నం చేశాడు. బాధితురాలి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు వెంకటేష్‌ను అరెస్టు చేసి కొవ్వూరు కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. నిందితునికి 14 రోజుల పాటు న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

ఏటిగట్ల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రాబోయే గోదావరి వరదల నేపథ్యంలో ప్రణాళికా బద్ధంగా ఏటిగట్ల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గోపినాధ్ అధికారులను ఆదేశించారు. ధవళేశ్వరంలోని ఇరిగేషన్ కార్యాలయంలో వరద ముంపు నివారణకు తొలి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత ధవళేశ్వరం హెడ్ వర్క్స్ ఇఇ కాశీ విశ్వేశ్వరరావు గోదావరి వరదల ఉధృతి, ఏటిగట్ల ప్రస్తుత స్థితిని వివరించారు. ఎస్ఇ గోపినాధ్ మాట్లాడుతూ సిబ్బంది కొరతను అధిగమించేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. అదనపు విధులు కేటాయించైనా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టేందుకు సంసిద్ధం కావాలన్నారు. అదే విధంగా ఫ్లడ్ మెటీరియల్‌కు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే సిద్ధం చేసుకోవాలన్నారు. పోలవరం నుంచి అంతర్వేది, యానాం వరకూ 536 కిలో మీటర్ల ఏటిగట్లు ఉన్నయన్నారు. బలహీనంగా ఉన్నవాటిని గుర్తించాలని తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరంలో ఏటిగట్లు బలహీనంగా ఉండటంతో ధవళేశ్వరం నుంచి తొలి ప్రమాద హెచ్చరిక విడుదలకు మునుపే ప్రమాద పరిస్థితులు నెలకొంటున్నాయని తక్షణమే అక్కడి ఏటిగట్లు పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో కోనసీమ తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల డిఇలు, ఎఇలు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్మీ కంపోస్ట్‌తో సంపద సృష్టి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వర్మీ కంపోస్ట్ అమ్మకాలతో గ్రామాల్లో సంపదను సృష్టించొచ్చని మండల పారిశుధ్య సమన్వయ కర్త కత్తుల ప్రకాష అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాలంగిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ కలుషితమైన వాతావరణంలో మానవ మనుగడ ప్రమాదకర స్థాయిలో ఉందన్నారు. ప్రజలు అనారోగ్యం పాలవ్వకుండా భవిష్యత్ తరానికి డబ్బులు కంటే మంచి ఆరోగ్య కరమైన వనరులు, పరిసరాలు అందించాలన్నారు. దాని కోసమే ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. వర్మీ కంపోస్ట్ తయారీకి సంబంధించి తడి, పొడి చెత్తను అందించడం, కంపోస్ట్ ఎరువు తయారీ వంటివాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.ఆంజనేయశర్మ, సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, కార్యదర్శి ఎమ్‌డి హాసన్ జానీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఆలమూరు

ఉచిత వైద్య శిబిరాల ద్వారా అందించే సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఏ.రాజు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మంగళవారం స్థానిక ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన భాను తేజస్ మల్టీ స్పెషాలిటీస్, రేవతి , డాక్టర్ మోహన్ డయాబెటిక్, గౌతమి నేత్రాలయం, రమా దంత వైద్యశాల వంటి పలు ఆసుపత్రులకు చెందిన వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లోని సుమారు 152 మంది ఉద్యోగులు పాల్గొని ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దీపక్, డాక్టర్ పవన్, డాక్టర్ మోహన్, డాక్టర్ విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిములను మోసగించిన కూటమి సర్కారు

చంద్రబాబు ఎంపీల మద్దతు వల్లే వక్ఫ్ చట్ట సవరణ : భరత్

నిరసనగా ముస్లిముల భారీ ప్రదర్శన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మైనార్టీలో ఉన్నప్పటికీ లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు పాసైందంటే అందుకు చంద్రబాబే కారణమని, వారి ఎంపీల మద్దతుతోనే ఈ బిల్లు వచ్చిందని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. వక్ఫ్ చట్టం -2025 రద్దు కోరుతూ ముస్లిం ఐక్య వేదిక పిలుపు మేరకు హబీబుల్లా ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. పెద్దఎత్తున ముస్లిములు పాల్గొన్నారు. ముస్లిం మహిళలు సైతం పాల్గొని ప్లకార్డులతో నిరసన తెలిపారు. వక్ఫ్ చట్టం-2025ను రద్దు చేయాలని నినదించారు. ఈ ర్యాలీలో మాజీ ఎంపీ మద్దతుగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు 'నారా హమారా' అని నమ్మబలికి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు మరోసారి ముస్లిములను మోసం చేశారని విమర్శించారు. తల్లికి వందనం అంటూ రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. నేడు వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్ సభలో మద్దతు తెలిపి బిల్లు పాసవ్వడానికి కారణమయ్యారన్నారు. అసలు టిడిపి మద్దతు లేకపోతే కేంద్రంలో ప్రభుత్వమే పడిపోతుందన్నారు. అలాంటిది బిల్లు పాసవ్వడానికి దోహద పడ్డ చంద్రబాబు నైజాన్ని ప్రతి ముస్లిం గుర్తు పెట్టుకోవాలని సూచించారు. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు వ్యతిరేకంగా వైసిపి ఓటు వేసిన విషయాన్ని అందరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. ఈ బిల్లు వల్ల ముస్లిములు ఎంత ఇబ్బంది పడుతున్నారో అర్థం చేసుకుని వైసిపి తరపున మద్దతు తెలుపుతున్నామని భరత్ తెలిపారు.



వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లిములు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలం పరిధిలోని కాటవరం, జాలిముడి గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం రూరల్ ఇఇ జెపిబి.నటరాజన్ తెలిపారు. 33/11కేవీ కాటవరం సబ్ స్టేషన్ నుంచి కొత్తగా 11కెవి కాటవరం ఫీడర్ లైన్ పనులు చేపట్టనున్న రీత్యా విద్యుత్ సరఫరాను బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల నిలిపేస్తున్నామని తెలిపారు. ఈ కారణంగా కాటవరం, జాలిముడి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధి హామీ చట్టం పనుల తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం


కూలీలో మాట్లాడుతున్న ఎంపిడిఒ భారతి

ముగ్గళ్ళలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఎపిడి రాంప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. కూలీల మస్తరు పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి బీమా యోజనను ఉపయోగించుకోవాలన్నారు. రోజువారీ వేతనం రూ.300 వచ్చేలా కొలతల ప్రకారం పనిచేయాలని తెలిపారు. అలాగే రఘుదేవపురంలో పనులను ఎంపిడిఒ భారతి తనిఖీ చేశారు. జాబ్‌కార్డు కలిగిన కూలీలు తప్పనిసరిగా పనికి హాజరవ్వాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ-శ్రామ్ పోర్టల్‌లో పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. కూలీలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

గురువులమే కాదు.. రక్షకులం కూడా...



గురువులంటే తరగతి గదిలో ఏవో నాలుగు పాఠాలు వల్లివేసేవారు మాత్రమే కాదు. బాధ్యతతో సమాజాన్ని తీర్చిదిద్దే స్ఫూర్తి ప్రదాతలు. అక్షరాలా ఈ నానుడిని నిజం చేస్తున్నారు కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హెచ్ఎం సత్యనారాయణ, తెలుగు మాస్టారు గొల్లపల్లి సత్యనారాయణ. గతంలో వర్షం నీటితో నిండిన పాఠశాల ప్రాంగణం కొరకు పలుగు, పార పట్టిన వారు... నేడు విద్యార్థుల రక్షణ కోసం పనికి దిగారు. ఎండలు మండుతున్నా... మంగళవారం మిట్ట మధ్యాహ్నం మండు టెండలో ప్రహరీ గోడకి రక్షణ ప్రాకారంగా ఇనుప తీగలు చుడుతూ కనిపించారు. సెలవు రోజుల్లో కూడా పాఠశాల గురించి, విద్యార్థుల చదువు, భవిష్యత్ గురించి ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి, వారి అంకితభావానికి అందరూ నమస్కరించాల్సిందే...

:: ప్రజాశక్తి - కడియం ::

గోపాలపురంలో ఆర్‌డిఒ పర్యటన

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం మండలంలో ఆర్‌డిఒ రాణి సుస్మిత సోమవారం పర్యటించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన అర్జీల నేపథ్యంలో ఆమె పలు గ్రామాల్లో విచారణ చేపట్టారు.మండలంలోని సగ్గొండ గ్రామ పరిధిలో ఆంధ్ర షుగర్స్ ఫ్యాక్టరీని విజిట్ చేశారు. ఆంధ్ర షుగర్స్ ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న 1.64 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమిని ఫ్యాక్టరీకు కేటాయించాలని దరఖాస్తు చేసినట్లు తెలిపారు.అదేవిధంగా అది ఫ్యాక్టరీకి సంబంధించి సల్ఫర్ ను ఫ్యాక్టరీ నందు స్టోరేజ్, రవాణా చేసేందుకు లైసెన్సు ఇప్పించాలని దరఖాస్తు చేసుకోవడంపై ప్రభుత్వ భూమిని పరిశీలించినట్లు తెలిపారు. లైసెన్సు ఇవ్వడంపై ఆంధ్ర షుగర్స్ ఫ్యాక్టరీను విజిట్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలోని గుడ్డిగూడెం గ్రామంలో సర్వే నెం.124-3లో .3.90ఎకరాల భూమిని 22-ఎ నుండి తొలగించాలని రైతు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. తన భూమి 2015లో పొరబాటున కాలువలో పడినట్లు తప్పుగా నమోదైందన్నారు. తన భూమి నిషేధిత భూమి జాబితాలోకి వెళ్లిపోవడంతో రిజిస్ట్రేషన్ కావడం లేదన్నారు. వెంటనే 22-ఎ నిషేధిత భూమి నుంచి తన భూమని వేరుచేయాలని దరఖాస్తు చేశారన్నారు. దీనిపై తహశీల్దార్ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారన్నారు. ఈ మేరకు ఈ భూమిని ఆర్‌డిఒ పరిశీలించారు. మండలంలోని నందిగూడెం గ్రామంలో రీ - సర్వే ఫేస్-2 సర్వే పనులను అకస్మికంగా పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సర్వే పనులపై సందేహాలను, వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే పనులపై తగు సలహాలు సూచనలు సిబ్బందికి ఇచ్చారు. ఆమె వెంట తహశీల్దార్ కె.అజయ్‌బాబు, సర్వేయర్లు, డిటిలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న ఆర్‌డిఒ రాణి సుస్మిత

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మారుముల గ్రామీణ ప్రాంతాలకు సైతం మెరుగైన రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. మండలం లోని గాడిలంక గ్రామంలో పల్లె పండగ పథకంలో రూ.కోటి వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డు ను మంగళవారం ఎంఎల్ఎ సుబ్బరాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం అధిక నిధులు వెచ్చిస్తుందన్నారు. అలాగే అన్నంపల్లి గ్రామంలో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించెందుకు ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని ఎంఎల్ఎ సుబ్బరాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గానికి 10 కుట్టు మిషన్ సెంటర్ లను మంజూరు చేసిందని, మహిళలు టైలరింగ్ లో శిక్షణ పొంది స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సుమారు 90 రోజుల శిక్షణాలో కనీసం 70 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న వారికే ఉచితంగా కుట్టు మిషన్ అందిస్తున్నారని అన్నారు. అనంతరం నగర పంచాయతీ పరిధిలో సుమారు రూ.1కోటి 68 లక్షల వ్యయంతో నిర్మించిన కొండాలమ్మ చింత, బాలయోగి పేట సిసి రోడ్డును, 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించి రూ.56.25లక్షలతో నిర్మించిన పలు సిసి రోడ్లను ఎంఎల్ఎ సుబ్బరాజు, ఎంపి హరీష్ మాధుర్ లు కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి కోలా గంగా భవాని, జడ్‌పిటిసి సభ్యుడు కుడిపూడి శివ శంకరరావు, మాజి ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, అర్ధాని శ్రీనివాస రావు, గొలకోటి దొరబాబు, దొమ్మేటి రమణ కుమార్,ములపర్తి బాలకృష్ణ, దాట్ల పృథ్వి, తాడి నరసింహరావు, గొల్లపల్లి గోపి, అడబాల సతీష్ కుమార్,దివి మహాలక్ష్మి, మెండి కమల, కుడిపూడి మల్లేశ్వరి,నగర పంచాయతీ కమిషనర్ రవి వర్మ, ఎఇ పివి.సుధాకర్ పంచాయతీ రాజ్ ఇన్‌ఛార్జి డిఇ పివి శ్రీనివాస్, కుట్టు శిక్షణ నియోజకవర్గ కోఆర్డినేటర్ కె.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంఎల్ఎ సుబ్బరాజు, ఎంపీ హరీష్

ఆక్వా అక్రమ చెరువు తవ్వకం పనుల అడ్డగింత

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల పరిధిలోని పల్లంకూరు పంచాయతీ పరిధిలోని విత్తనాల వారి కాలువ గట్టు సమీపంలో రొయ్యల చెరువు అక్రమ తవ్వకాన్ని గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. దీంతో ఇక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో మంచినీటి నిలువ కోసం చెరువు తవ్వుతామని చెప్పి చెరువు తవ్వేశారని, ఇప్పుడు దీనిని రొయ్యల చెరువుగా మార్చేందుకు కొంతమంది తవ్వకాలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు. సుమారు 80 కుటుంబాలకు చెందిన ప్రజలు ఇక్కడ నివాసం ఉంటున్నారని రొయ్యల చెరువు తవ్వితే తాము భవిష్యత్తులో ఇబ్బందులు పడతామని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు రొయ్యల చెరువుల అక్రమ తవ్వకాలపై దృష్టి నిలిపి పనులు నిలిపివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేకపోతే ఉద్యమం చేపడతామని ఈ సందర్భంగా గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

కౌలు హక్కు బహిరంగ వేలంపాట ప్రకటన

కాకినాడ జిల్లా, పెద్దాపురం పట్టణం, ఎల్విన్‌పేటలో గల శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానము తాలూకు పెద్దాపురంలో మెరక పల్లం భూములకు 2025-26 నుండి 2027-28 సం॥ల వరకు అనగా మూడు సంవత్సరముల కాలపరిమితికి కౌలుహక్కు బహిరంగ వేలంపాట ది. 21-5-2025 మధ్యాహ్నం 11-00 గంటల నుండి గ్రూపు దేవాలయముల కార్యాలయము, శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ఆవరణ, పెద్దాపురం నందు దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారుల సమక్షమున బహిరంగ వేలంపాటలు నిర్వహించబడును.

షెడ్యూలు

వ.నెం.	సర్వే నెం.	విస్తీర్ణం య.ట్లు	భూమి స్వభావం	భూమిఉన్న గ్రామం	కౌలు కాలపరిమితి	ధరావత్తు (రూ.)
1	864/4	0-71	మెరక	పెద్దాపురం	2025-26 నుండి 2027-28	10,000/-
	865/3	2-19	పల్లం	పెద్దాపురం	2025-26 నుండి 2027-28	
	మొత్తం	2-90				

పాట ముఖ్య షరతులు

1. ఈ వేలం పాట జి.ఒ.ఎం.ఎస్. నెం. 379 రెవెన్యూ (ఎండోమెంట్స్-1) డిపార్టుమెంట్ ది 11-3-2003 ఉత్తర్వులను అనుసరించి దేవదాయశాఖ అధికారుల ఆమోదమునకు లోబడి దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిచే నిర్వహించబడును.
2. బహిరంగ వేలంపాటలో పాల్గొనదలచినవారు పైన పేర్కొనబడిన ధరావత్తు సొమ్ము చెల్లించి మరియు తన నిర్దిష్టమైన స్థిరాస్తికి సంబంధించిన సాల్వెన్సీ సర్టిఫికెట్ రెవెన్యూ అధికారుల వద్ద నుండి పొంది, పాట సమయమున చూపించవలెను.
3. హెచ్చుపాటదారుని పేర పాట కొట్టివేసిన వెంటనే పాట ఒక సంవత్సరం మక్తా చెల్లించవలెను.
4. దేవస్థానమునకు బకాయి ఉన్నవారు, ఇతర లావాదేవీలు ఉన్నవారు పాటలో పాల్గొనుటకు అర్హులు కారు.
5. ఏ కారణము తెలుపకయే పాటను నిలిపివేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారికి పూర్తి అధికారము కలదు.

ఇతర పాట షరతులు, వివరములు తెలుసుకొనగోరువారు దేవస్థానం కార్యాలయం పనిచేయు వేళలలో సంప్రదించవలెను.
గమనిక: ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ తప్పనిసరిగా తీసుకురావలెను.

పెద్దాపురం
తేది.6-5-2025

ఇట్లు: అర్చక & సింగిల్ ట్రస్టీ
శ్రీసీతారామస్వామివారి దేవస్థానం (చినభద్రాద్రి)
ఎల్విన్‌పేట, పెద్దాపురం - 94404 60951

CHANGE OF NAME

I, MALASANI V.V.S.S.V.PRASAD MURTHY, S/o. Nukaraju, D.No. 28-2-2, Venkateswara Matam Veedhi, Devichowk, Rajahmundry, E.G. District, A.P., PIN: 533101, I have changed my name from **MALASANI VEERA VENKATA SATYA SURYA VARA PRASADA MURTY** (Old Name) to **MALASANI V.V.S.S.V. PRASAD MURTHY** (New Name). Henceforth Iam being called **MALASANI V.V.S.S.V.PRASAD MURTHY,** S/o. Nukaraju, for all purpose.

పేరు మార్పు

I, కుడుపూడి మోహన దుగ్ర ప్రసాద్ తండ్రి: కుడుపూడి గంగిశెట్టి, D.No. 2-49, గాజులగుంట, ముంగండపాలెం, పి.గన్నవరం మండలం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్:533214 నుండి నా పేరు **మోహన దుగ్ర ప్రసాద్** నుండి మార్చబడింది. **మోహన దుగ్ర ప్రసాద్** (పాత పేరు) నుండి **కుడుపూడి మోహన దుర్గా ప్రసాద్** (కొత్త పేరు). ఇకపై నాపేరు **కుడుపూడి మోహన దుర్గా ప్రసాద్,** S/o. గంగిశెట్టి అని పిలుస్తారు. అన్ని ప్రయోజనాల కోసం.

మత్స్య సంపద వృద్ధికి చర్యలు

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు నియోజకవర్గంలో మత్స్య సంపదను వృద్ధి చేసేందుకు పటిష్ట చర్యలు చేపట్టామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మంగళవారం నిడదవోలులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యశాఖకు సంబంధించి సుమారు రూ.1,27,06,075 విలువైన 255 యూనిట్లకు ప్రతిపాదనలు పంపామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యశాఖలో అందిస్తున్న లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్లు (మొబైల్), రోజుకు 20 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన పెద్ద మిల్లుల ఏర్పాటు, సంప్రదాయ మత్స్యకారులకు పడవలు, వలలు అందించడం, ఐస్ బాక్స్‌లతో కూడిన సైకిల్, మోటార్ సైకిల్, బయోఫ్లాక్ కల్చర్ వ్యవస్థ ఏర్పాటు, రిజర్వాయర్‌లలో ఫింగర్ లింక్స్ నిల్వ చేయడం, చేపపిల్లల పెంపకం తదితర 7 రకాల వివిధ స్కీమ్‌ల లబ్ధిదారుల ఎంపికకు చర్యలు తీసుకుంటామన్నారు. మత్స్యకార సంఘాలను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. త్వరలోనే సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసామన్నారు. ఇప్పటికే మత్స్యకారుల సంక్షేమం కోసం మత్స్యకారుల వేట నిషేధ భృతి అందించామని గుర్తుచేశారు. మత్స్యకారుల సంక్షేమం, సంతోషం కోసం ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ వహించారని తెలిపారు. ఈ సందర్భంగా నిడదవోలు నియోజకవర్గానికి సంబంధించి మత్స్యకారుల సంక్షేమం కోసం రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ రాణి సుస్మిత, ఎఎస్ఒ ఎం.నాగాంజనేయలు, వ్యవసాయ శాఖ ఎడి పి.చంద్రశేఖర్, ఎఒ సత్యనారాయణ పాల్గొన్నారు.